కవిత అరెస్టు అప్రజాస్వామికం


మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

సాక్షినెట్‌వర్క్: దేశంలో బీజేపీ ప్రభుత్వం ఎప్పుడు అనుకుంటే అప్పుడు ఈడీ తనిఖీలు జరుగుతాయని, ఎమ్మెల్సీ కవిత అరెస్టు సైతం అదే కోవలో జరిగిందని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శనివారం నవాబుపేట మండలంలోని గురుకుంట ఎంపీ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లిక్కర్ స్కాం విషయం ఏళ్ల నుంచి నాన్చుతూ వస్తున్న బీజేపీ నాయకులు దాన్ని కేవలం ఎన్నికలకు ఉపయోగపడేలా వాడుకుంటూ వస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు 24 గంటల ముందు ఒక మహిళా ప్రజాప్రతినిధురాలిని అరెస్టు చేసి బీఆర్‌ఎస్ క్యాడర్‌లో ఆందోళన కలిగించాలన్న దురుద్దేశమే కనిపిస్తుందన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను మానసికంగా ఇబ్బందిపెట్టాలని వారు అనుకోవచ్చని, బీఆర్‌ఎస్ క్యాడర్ తెలంగాణలో చాలా బలంగా ఉందని త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో వారి సత్తాచాటుతామని పేర్కొన్నారు. దేశంలో చాలామంది బ్యాంకులకు రూ.కోట్లు ఎగ్గొట్టినా పట్టించుకోని బీజేపీ ప్రభుత్వం కవిత విషయంలో అత్యుత్సాహం ప్రదర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఎవరెన్ని చేసినా ప్రజలు బీఆర్‌ఎస్ పక్షాన ఉన్నారని వివరించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మయ్య, నాయకులు ప్రతాప్, నాగిరెడ్డి, చెన్నయ్య, కృష్ణారెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఉద్దేశపూర్వకంగా కుట్రలు చేసి ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారని మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింలు, మాజీ వైస్ చైర్మన్ గణేష్, హన్వాడ ఎంపీపీ బాల్‌రాజ్, పట్టణ అధ్యక్షుడు శివరాజ్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలో తెలంగాణ చౌరస్తాలో నిరసన చేపట్టారు. కౌన్సిలర్లు రవికిషన్‌రెడ్డి, అనంతరెడ్డి పాల్గొన్నారు.

దేవరకద్రలో నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ రమాదేవి, మండల అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, వెంకటేశ్, కరణంరాజు, కొండారెడ్డి, రాము, శ్రీకాంత్, ఆంజనేయులు, శివానంద్ పాల్గొన్నారు.

భూత్పూర్ చౌరస్తాలో శనివారం మండల బీఆర్‌ఎస్ నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నారాయణ గౌడ్, వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, మురళీధర్ గౌడ్, మనిమోని సత్యనారాయణ, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్లలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు ఈడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్‌ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు నాయకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, కౌన్సిలర్లు లత, చైతన్య, దేవ, రమేశ్, చౌహాన్ మండల పార్టీ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


జిల్లాకేంద్రంలో నిరసన తెలుపుతున్న నాయకులు

నిజాయితీగా ప్రజలకు సేవ చేస్తా


ఐటీ టవర్ వద్ద పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రజలకు నిజాయితీగా సేవ చేయాలన్నదే తన లక్ష్యం అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వందరోజులైన సందర్భంగా శనివారం జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజా సమస్యలు ఏమి ఉన్నా తన దృష్టికి తెస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తానన్నారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు వారికి ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత జీరో బిల్లు వస్తుందన్నారు. మహబూబ్‌నగర్ మండలంలో 10 వేలు, హన్వాడలో 7 వేలు, మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 14,662 మందికి ఇది వర్తిస్తుందన్నారు. ఈపాటికే పీయూకి రూసా నిధుల కింద రూ.100 కోట్లు మంజూరయ్యాయన్నారు. జిల్లావ్యాప్తంగా 10 వేల మంది విద్యార్థులు ఇంజినీరింగ్, న్యాయ విద్య కోసం వేరే ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే చదువుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రూ.20 కోట్లతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభిస్తున్నామన్నారు. వృత్తి, సాంకేతిక విద్య అభివృద్ధికి గాను రెండు ఐటీఐ కళాశాలలకు రూ.7.5 కోట్లు మంజూరు చేయించామన్నారు. అమృత్ పథకం కింద మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో రూ.216 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) చేపట్టేందుకు టెండర్లు పూర్తయ్యాయన్నారు. రూ.15 కోట్లతో ఐదంతస్తుల ఉర్దూ ఘర్, రూ.25 కోట్లతో షాదీఖానా, మౌలాలిగుట్ట వద్ద అన్ని మతాల వారికి సంబంధించిన శ్మశాన వాటికల కోసం ఐదెకరాల చొప్పున స్థలం కేటాయిస్తున్నామన్నారు. చనిపోయిన వారి అంతిమయాత్ర కోసం రెండు వాహనాలు ఏర్పాటు చేస్తామన్నారు. పీయూ వద్ద 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మించి నాణ్యమైన విద్యుత్ అందిస్తామన్నారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, డీసీసీ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెన్‌హర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.

అన్నపూర్ణ క్యాంటీన్‌కు షెడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కొనసాగుతున్న అన్నపూర్ణ క్యాంటీన్‌కు త్వరలోనే షెడ్ నిర్మిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం అక్కడ ఎలాంటి సౌకర్యాలు లేని ఈ క్యాంటీన్‌ను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో 500 గ్లాసుల మజ్జిగను మున్సిపల్ నిధుల నుంచి నిర్వాహకులకు అందించాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌ను ఆదేశించారు. అంతకుముందు తెలంగాణచౌరస్తాలో కొత్తూరు శ్రీనివాస్‌రెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం దివిటిపల్లిలోని ఐటీ టవర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మోతీలాల్, జాజిమొగ్గ నర్సింహులు, అంజద్, మాజీ కౌన్సిలర్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

పాలమూరు: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలో ఆదివారం 'రాయగూడని పద్యం' అనే పుస్తక ఆవిష్కరణ సభ నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు సభ ఉంటుందని, మౌమితా ఆలం, ప్రొఫెసర్ హరగోపాల్ హాజరవుతారని చెప్పారు.

క్లుప్తంగా

విధులకు హాజరుకాకపోతే చర్యలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్సెస్సీ పరీక్షల్లో విధులు నిర్వహించేందుకు కేటాయించిన ఉపాధ్యాయులు వెంటనే సంబంధిత పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్‌కు రిపోర్టు చేయాలని డీఈఓ రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతి లేకుండా హాజరుకానిచో చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

డిప్యూటీ చైర్మన్‌గా నర్సింహ్మయ్య



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నేషనల్ కన్జ్యూమర్ రైట్స్ కమిషన్ రాష్ట్ర డిప్యూటీ చైర్మన్‌గా జిల్లా కేంద్రానికి చెందిన మంత్రి నర్సింహ్మయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో కమిషన్ ఫౌండర్, చైర్మన్ డా.ఎం.వి.ఎల్.నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు.

జితేందర్‌రెడ్డికి సన్మానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధిగా నియమితులైన మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డిని శనివారం ఎంఆర్‌పీఎస్ ఆర్‌ఆర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత పోరాటాలకు సహకరించాలని సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని కలిశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాసు, నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, రాజగాని అశోక్, డా.శ్యామూల్, రాంప్రసాద్, యాంకి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేయాలి


అంచన్‌పల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ దేవన్న

గండేడ్: గ్రామాల్లో లక్ష్యం మేరకు పన్నులు తప్పనిసరిగా వసూలు చేయాలని ఎంపీడీఓ దేవన్న పేర్కొన్నారు. శనివారం అంచన్‌పల్లిలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల, గ్రామపంచాయతీలను తనిఖీ చేశారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. మార్చి ఆఖరులోగా గ్రామానికి సంబంధించిన మొత్తం పన్నులు వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామపంచాయతీ రికార్డులు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. ప్రతీది ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. తీర్మానాలు చేసినపుడు మినిట్స్ తప్పనిసరిగా ఎంట్రీ చేయాలన్నారు. అన్ని రకాల రిజిస్టర్లు గ్రామపంచాయతీలో ఉండేలా కార్యదర్శులు చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందించాలన్నారు. నర్సరీల్లో మొక్కలు చనిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. షేడ్ నెట్లు వేయాలని వివరించారు. పంచాయతీ కార్యదర్శి నీలమ్మ తదితరులు ఉన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘననివాళి

జడ్చర్ల టౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి పురస్కరించుకుని శనివారం మున్సిపాలిటీ పరిధిలోని వాసవీ కమాన్ వద్ద ఉన్న ఆయన విగ్రహం వద్ద ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. ఆర్యవైశ్య నాయకులు పాలాది రామ్మోహన్, దాచేపల్లి చంద్రయ్య, కొత్రమధులు మాట్లాడుతూ పోరాట పటిమను శ్రీరాములు స్ఫూర్తిగా ముందుకు సాగాలన్నారు. ఆర్యవైశ్యులు వ్యాపార రంగంలోనే కాకుండా అన్ని రంగాల్లోనూ రాణించేందుకు ఆయనను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు మేడిశెట్టి రామకృష్ణ, అమరవాది ప్రభు, మురళి, కండెకృష్ణ, హైమావతి, వసుంధర పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న నాయకులు

'గ్యాస్' అక్రమ దందా: ముగ్గురిపై కేసునమోదు

కోయిల్‌కొండ: మండలంలోని అభంగపటాన్నికి చెందిన రమేష్, శ్రీహరి, యాదయ్యలపై గ్యాస్ అక్రమదందా చేస్తున్నారన్న నేపథ్యంలో పోలీసులు కేసునమోదు చేశారు. సదరు వ్యక్తులు భారత్ గ్యాస్ డొమెస్టిక్ సిలిండర్‌లో నుంచి అక్రమంగా గ్యాస్‌ను కమర్షియల్ సిలిండర్‌లోకి శుక్రవారం రాత్రి పట్టుబడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాఘవేందర్ తెలిపారు. గ్యాస్ సిలిండర్లను మార్చి ప్రైవేట్ వాహనంలో తరలిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు వాహనంతో పాటు 84 భారత్ సిలిండర్లు, 64 ఇండియన్ కమర్షియల్ సిలిండర్లను సీజ్ చేశామన్నారు.

టీకాలు వేయించండి

బాలానగర్: రైతులు పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలని జిల్లా పశువైద్యాధికారి మధుసూదన్ గౌడ్ సూచించారు. శనివారం ఉడిత్యాలలో టీకాల శిబిరాన్ని పరిశీలించారు. పశువులకు ముందస్తుగా టీకాలు వేస్తున్నామని అన్నారు. ఇప్పటికే గ్రామంలో 313 ఆవులు, 101 బర్రెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని అన్నారు. మండల అధికారి రాఘురాం, కుమార్ పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన యువకుడు ఫిరోజ్ ఇటీవల మూసాపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా బాధితుడిని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శనివారం ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

నేడు రెడ్డిసేవా సమితి వార్షికోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని రాయిచూర్ రోడ్డు రాజా బహదూర్‌రెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం పాలమూరు రెడ్డి సేవా సమితి 22వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్‌రెడ్డి, కోశాధికారి మల్లు నరసింహారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు వార్షికోత్సవం ప్రారంభమవుతుందని, ఉమ్మడి జిల్లాలోని రెడ్డి బంధువులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

కాంగ్రెస్‌లోకి వైస్ ఎంపీపీ

అడ్డాకుల: రాచాలకి చెందిన వైస్ ఎంపీపీ రాధిక బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలో శనివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి సమక్షంలో రాధికతో పాటు ఆమె భర్త జయప్రకాష్ కూడా కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీహరి, జగదీశ్వర్, నాగిరెడ్డి, తిరుపతయ్య యాదవ్ ఉన్నారు.

ఇంటివద్ద పార్క్ చేసిన వాహనం చోరీ

రాజాపూర్: ఇంటివద్ద పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండల కేంద్రానికి చెందిన కమ్మరి శివయ్య తన ఇంటి ఎదుట శుక్రవారం రాత్రి రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని పార్క్ చేశారు. ఉదయం లేచి చూసే సరికి వాహనం కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి వివరించారు.

మెస్ ప్రారంభించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ పరిధిలోని కొల్లాపూర్ పీజీ సెంటర్ హాస్టల్‌లో వెంటనే విద్యార్థులకు మెస్‌ను ప్రారంభించాలని వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్‌కు విద్యార్థిసంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. సంఘాల నాయకులు మాట్లాడుతూ అక్కడ ఉన్న హాస్టల్ భవనంలో విద్యార్థులు వంట వండుకుని తిని తరగతులకు హాజరవుతున్నారని, దీని ద్వారా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే మెస్ ప్రారంభించి వైఫై, తాగునీరు, లైబ్రరీ వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు రాము, సురేందర్, వెంకట్, సౌందర్య, పద్మ, ఉమా, గౌరీ తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలిన నాయకులు

మిడ్జిల్: ప్రధాని నరేంద్రమోదీ శనివారం నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన బహిరంగ సభకు మిడ్జిల్ మండలం నుంచి బీజేపీ నాయకులు ప్రజలను భారీగా తరలించారు. ప్రతి గ్రామం నుంచి ప్రత్యేకంగా వాహనం ఏర్పాటు చేశారు. జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, మండల అధ్యక్షుడు నరేందర్, నాయకులు తిరుపతి, రవీందర్, భాస్కర్, నరేందర్, అంజి, విష్ణు, తదితరులు ఉన్నారు.

భక్తిమార్గం అనుసరణీయం


జనసంద్రంగా మారిన ఆలయ పరిసరాలు

నవాబుపేట: మూడు రోజులుగా జంగమయ్యపల్లిలో విగ్రహప్రతిష్ఠ వేడుకలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. శనివారం ధ్వజస్తంభం, బొడ్రాయి, ఆంజనేయస్వామి నూతన ఆలయం ప్రారంభం, విగ్రహాల ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. వేడుకతో గ్రామం జనసంద్రంగా మారింది. విగ్రహ ప్రతిష్ఠకు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, తాజా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సోదరుడు దుశ్యంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించాలన్నారు. జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, వైస్‌ఎంపీపీ సంతోష్, మార్కెట్ మాజీ చైర్మన్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

రాముడి దయతో దేశమంతా బాగుంటుంది

శ్రీరాముడి దయతో దేశం మొత్తం సుభిక్షంగా ఉంటుందని.. అందుకోసం ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ తెలిపారు. శనివారం రాత్రి జంగమయ్యపల్లిలో విగ్రహాల ప్రతిష్ఠ వేడుకలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరాముడి అనుగ్రహంతో మోదీ మరోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. ప్రతి ఓటరు శ్రీరామసేతు నిర్మాణంలో ఉడత సాయం మాదిరిగా తాజాగా దేశాభివృద్ధిలో మోదీకి సహకారం అందించాలన్నారు. మాజీ సర్పంచ్ వెంకటేష్, నరేష్, రాజు, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అడ్డాకుల: శాఖాపూర్ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గద్వాల ప్రాంతానికి చెందిన వెంకటేష్, నవీన్ ఇద్దరు కలిసి బొలేరో వాహనంలో భూత్పూర్ వైపు నుంచి స్వస్థలానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో శాఖాపూర్ వద్ద రోడ్డు పక్కన నిలిచిన వాహనాన్ని ఢీకొట్టుకున్నారు. దీంతో బొలేరో క్యాబిన్‌లో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఎల్‌అండ్‌టీ అంబులెన్స్ సిబ్బంది జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

అంకిత భావంతో పనిచేయాలి



గండేడ్: ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని.. మంచి పేరు తెచ్చుకోవాలని వైస్ ఎంపీపీ ఈశ్వరయ్యగౌడ్ పేర్కొన్నారు. పెద్దవార్వాల్ గ్రామపంచాయతీ కార్యదర్శి హంస జడ్చర్ల మండలం నసుర్లబాద్‌కు బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో.. శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఆమెను ఘనంగా సన్మానించారు. గ్రామపాలన సమర్థవంతంగా నిర్వహించడంలో కార్యదర్శులదే కీలక పాత్ర అన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరిస్తూ తలకు మించిన భారాన్ని కార్యదర్శులు మోస్తున్నారని గ్రామాల్లో వారి సేవలు ప్రశంసనీయం అని వైస్ ఎంపీపీ పేర్కొన్నారు. నూతన కార్యదర్శి సంజీవరెడ్డి, చెన్నారెడ్డి, కాశీనాథ్‌రెడ్డి, రాములు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయం కోసం పని చేద్దాం

పాలమూరు: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తూ..ఓటర్లకు చేరువకావడానికి ప్రయత్నం చేయాలని బీజేపీ మహబూబ్‌నగర్ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ ఈనెల 19న పార్లమెంట్ కోర్ కమిటీ, పార్లమెంట్ ఎన్నికల మేనేజ్మెంట్ కమిటీ సమావేశాలు జిల్లా కేంద్రంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో పాటు ప్రతి అసెంబ్లీ వారిగా కోర్ కమిటీ కార్యాలయాలు ప్రారంభం చేయాలని సూచించారు. అసెంబ్లీలలో కొత్తగా కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని సంస్థాగత విషయాలపై ప్రత్యేకంగా చర్చించాలన్నారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పార్లమెంట్ ప్రభారి కేవీఎల్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు బి.కొండయ్య, బాలరాజు, నేతలు ప్రశాంత్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, సదానందరెడ్డి, అంజయ్య, బుడ్డన్న, సాహితీరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులైన చిన్నారులు

రాజాపూర్: మండల పరిధిలోని ఖానాపూర్ గ్రామంలోని ప్రభుత్వప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. తమ బోధనకు సంబంధించిన అనుభవాలను పంచుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, విద్యపై ఆసక్తి పెరిగేందుకు అవకాశం ఉంటుందని హెచ్‌ఎం రాఘవేందర్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

బహుమతుల ప్రదానం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో సిబ్బందికి గత వారం నిర్వహించిన పలు ఆటల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి శనివారం ప్రిన్సిపాల్ పద్మావతి బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆటల పోటీలు నిర్వహించడం వల్ల సిబ్బంది మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ క్లబ్ కన్వీనర్ శివప్రసాద్, అధ్యాపకులు సత్యభాస్కర్, ఈశ్వరయ్య, రాములు, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసంపై వెనకడుగు

బాలానగర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం విషయంలో సభ్యులు వెనకడుగు వేశారు. ఫిబ్రవరి 21న తీర్మానం పెట్టాలని ఉన్నతాధికారులకు విన్నవించిన వారు.. ఈ నెల 14న రద్దు చేసుకుంటూ వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు 15న అధికారులు తీర్మానం రద్దు చేసినట్లు పీఏసీఎస్ సీఈఓ శ్యాంసుందర్ తెలిపారు.

రాఘవేంద్రస్వామి జయంతి

జడ్చర్ల టౌన్: బాదేపల్లిలోని మఠంలో శనివారం రాఘవేంద్రస్వామి జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, తులసి అర్చన, నూతన వస్త్రాలు, పుష్ప అలంకరణలు చేశారు. భక్తుల ఆధ్వర్యంలో విష్ణునామపారాయణం, భక్తిగీతాలు, భజనలు చేశారు.

కార్మికులు ఏకం కావాలి



చిన్నచింతకుంట: బీడీ కూలి పెంపుకోసం కార్మికులంతా ఏకం కావాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీడీ కార్మికుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి బీడీ ఫ్యాక్టరి యాజమాని సోయల్ సేట్‌కు డిమాండ్ నోటీస్ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సూర్యం ఈసందర్భంగా మాట్లాడారు. బీడీ ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికులకు పనికి తగ్గ కూలి ఇవ్వలేదని ఆరోపించారు. దీంతో బీడీ పరిశ్రమపై ఆధార పడి జీవిస్తున్న కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పూటగడవని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి రేటు పెంపునకు యాజమాన్యం త్వరగా ముందుకు రావాలన్నారు. వెయ్యి బీడీలు చుడితే కనీసం రూ.350 చెల్లించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఐఎఫ్‌టీయూ, సీపీఐ నాయకులు రాంచందర్, సామేల్, అరుణ్‌కుమార్, చంద్రన్న, సాంబశివుడు, ఆర్‌ఆర్ మణ్యం, తిరుపతమ్మ, వెంకటేష్, బీడీ కార్మికులు రత్నం, సబేర, ఇబ్రహిం, ఆంజనేయులు, నరసింహులు, వెంటమ్మ, బాలమ్మ, వనపర్తి, నర్వ, ధన్వాడ మండలాల బీడీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.